నేడు బీఆర్ఎస్ ముఖ్యనాయకుల సమావేశం

ఖమ్మం, ఏప్రిల్ 15: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఖమ్మం మమత ఆసుపత్రి ఆవరణలోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇంటివద్ద ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ హాజరు కానున్నారు. కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు సకాలంలో పాల్గొనాలని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం, ఏప్రిల్ 15: మండలంలోని జమలాపురంలోని వాసిరెడ్డి కల్యాణ మండపంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు బీఆర్ఎస్ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాస రెడ్డి సోమవారం తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లు వేగిరం చేయాలి: కలెక్టర్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 15 : ఖమ్మం లోక్‌సభ స్థానానికి ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితాకు సంబంధించి దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని, మిగులు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పట్ల జాగ్రత్తగా ఉండాలని, జడ్పీ సీఈవో, ఎంపీడీవోలు బాధ్యత వహించాలని తెలిపారు. శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, జిల్లా ఉపాధికల్పన అధికారి కె.శ్రీరామ్, డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో వినోద్, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, మీనన్, రాంబాబు, సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు: ఏసీపీ

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్15: సత్తుపల్లి ప్రాంతంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, కోడిపందేలు, పేకాట నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని కల్లూరు ఏసీపీ రఘు హెచ్చరించారు. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని కాకర్లపల్లిలోని ఓ మామిడి తోటలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు ఈ నెల 13న సత్తుపల్లి సీఐ కిరణ్, ఇంటిలిజెన్స్ సీఐ రామకృష్ణలకు సమాచారం వచ్చిందన్నారు. దీంతో వారు తమ సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. ఘటనా స్థలంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, ల్యాప్‌టాప్, నాలుగు సెల్‌ఫోన్ల, రూ.13,260 నగదు, క్రికెట్ బెట్టింగ్‌కు రాసిన ఓ నోట్‌బుక్‌ను స్వాధీనపర్చుకున్నట్లు వివరించారు. కొందరు వ్యక్తులు పారిపోగా వారిలో 10 మందిని ఈ నెల 14న సాయంత్రం అదుపులోకి తీసుకున్నామన్నారు. మరికొందరు కూడా పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు. వీరికి సంబంధించిన మూడు బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేయించినట్లు చెప్పారు. ఈ అకౌంట్లలో రూ.7.60 లక్షల నగదు నిల్వ ఉన్నట్లు గుర్తించామన్నారు. అదేవిధంగా సోమవారం మధ్యాహ్నం సత్తుపల్లి మండలం యాతాలకుంట సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.39,600 నగదు, 5 మోటార్‌సైకిళ్లు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకున్నట్లు వివరించారు. కొందరు పరారీలో ఉన్నారని, వీరిని అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో సత్తుపల్లి టౌన్ సీఐ కిరణ్, టాస్క్‌ఫోర్స్ సీఐ రామకృష్ణ పాల్గొన్నారు.

రామాలయంలో 'సండ్ర' ప్రత్యేక పూజలు

ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, ఏప్రిల్15: కల్లూరు మండలం రఘునాథగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీరామాలయ ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత సండ్రను ఆలయ కమిటీ నిర్వాహకులు సత్కరించి శ్రీసీతారామచంద్రస్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 15: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురంలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని సోమవారం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నుంచి వచ్చిన ముత్యాల తలంబ్రాలను దేవస్థాన కార్యనిర్వహణాధికారి దంపతులు స్వామికి సమర్పించారు. గ్రామపంచాయతీ ఆనవాయితీగా తెచ్చే పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను డీపీవో హరికిషన్ దంపతులు సమర్పించారు. దాతలు తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలాకుమారి దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
jobs Apply Now!
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వ్యక్తి ఆత్మహత్య

రఘునాథపాలెం, ఏప్రిల్ 15: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. రఘునాథపాలెం పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం బాలప్పేట ప్రాంతానికి చెందిన కణతాల వెంకన్న (40) టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండేళ్లుగా చెడు అలవాట్లకు గురై అప్పులు చేస్తూ కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. దీంతో భార్య లత పలుమార్లు మందలించినా పట్టించుకోకపోవడంతో పాటు మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో సోమవారం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి రఘునాథపాలెం రెవెన్యూ పరిధిలోని ఓ చేనులోని వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

రాజకీయాలకు అతీతంగా పనిచేస్తా..

- మళ్లీ గెలిపించండి.. మరింత అభివృద్ధి చేసి చూపిస్తా..
- ఆత్మీయ సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నామా, చిత్రంలో ఎమ్మెల్సీ మధు

ఖమ్మం, ఏప్రిల్ 15: మరోసారి తనను ఎంపీగా గెలిపిస్తే రాజకీయాలకు అతీతంగా పనిచేస్తూ జిల్లాను మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం 55వ డివిజన్‌లో మోతారపు సుధాకర్ నేతృత్వంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తండ్రి నామా ముత్తయ్య పేరుతో ట్రస్ట్ పెట్టి పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రూ.8 వేల కోట్ల విలువైన జాతీయ రహదారులను తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. నాయకులు తాళ్ళూరి జీవన్, వీరూనాయక్, మోతారపు శ్రావణి, మోరంపూడి ప్రసాద్, వెంకటాచారి, చిత్తారు సింహాద్రియాదవ్, నామా సేవాసమితి నుంచి రాజేశ్, చీకటి రాంబాబు, సరిపూడి గోపి, కృష్ణప్రసాద్, అపార్ట్‌మెంట్ వాసులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం బ్యాంక్‌కాలనీలో మండవ వెంకట సుబ్బారావు, వీడియోస్ కాలనీలో కనకమేడల గోపాలకృష్ణను నామా నాగేశ్వరరావు పరామర్శించారు.

తాగునీటి అవసరాలకే 'పాలేరు' జలాలు

ఫిల్టర్‌బెడ్ పరిశీలనలో జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్

దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్

ఖమ్మం, ఏప్రిల్ 15: జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఉభయ ఖమ్మం జిల్లాల తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేక అధికారి, ప్రభుత్వ కార్యదర్శి సురేంద్రమోహన్ తెలిపారు. ఖమ్మం దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్ వద్ద నీటి నిల్వను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. పాలేరు జలాశయం నుంచి విడుదల చేసిన నీటిని తాగునీటి అవసరాల కోసమే వినియోగించాలని సూచించారు. అనంతరం రామన్నపేట, శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. లకారం ట్యాంక్‌బండ్‌కు వెళ్లి ఎస్ఎస్ ట్యాంక్‌లో నీటి నిల్వను పరిశీలించారు. శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, అధికారులు రంజిత్‌కుమార్, కృష్ణలాల్, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

కొణిజర్ల, ఏప్రిల్ 15: ప్రస్తుతం వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రానీయొద్దని తాగునీటి సరఫరా జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ ఆదేశించారు. ఎక్కడా సమస్య తలెత్తకుండా అధికారులు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి కొణిజర్లతోపాటు చిన్నగోపతిలో సోమవారం ఆయన పర్యటించారు. చిన్నగోపతి పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలను పరిశీలించారు. కొణిజర్లలోని ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించారు. సదాశివకుమార్, పుష్పలత, నవీన్‌కుమార్, సతీశ్‌కుమార్, చైతన్యకుమార్, తఫజల్ హుస్సేన్, రోజారాణి, సైదులు, ప్రభాకర్‌రెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

భర్త, అత్తపై కేసు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని ఆటోనగర్‌కు చెందిన వివాహిత అల్లిక కవిత (25) ఆదివారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఖమ్మం రూరల్ ఎస్సై రామారావు కథనం ప్రకారం.. చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన అల్లిక పుల్లారావుకు కొణిజర్ల మండలం రామనర్సయ్య గ్రామానికి చెందిన కవితతో 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహం అనంతరం పుల్లారావు ఖమ్మం రూరల్ మండలంలోని ఆటోనగర్‌లో ఉంటూ పరిసర గ్రామాల్లో ఆర్ఎంపీ వైద్యం చేస్తున్నాడు ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. పుల్లారావు ఇతర మహిళలతో వివాహేతర సంబంధాలు పెట్టుకోవడంతో అనేకమార్లు పంచాయితీలు జరిగాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో కవిత సోదరుడు గుడిచుట్టు నాగరాజు వచ్చి ఆమను ఓదార్చి వెళ్లిపోయాడు. ఆ తరువాత మళ్లీ భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో కవిత బెడ్‌రూంలోకి వెళ్లి తాళం వేసుకుంది. భర్త ఇంటి ఆవరణలో పడుకున్నాడు. ఉదయం లేచిన తరువాత పుల్లారావు తన రోజువారీ ఆర్ఎంపీ ప్రాక్టీస్‌కు వెళ్లాడు. ఆ తరువాత కవిత పెద్ద సోదరుడు ఆమెకు ఎంతసేపు ఫోన్ చేసినా ఎత్తడం లేదు. దీంతో ఖమ్మంలో ఉంటున్న మరో సోదరుడు నాగరాజుకు విషయం తెలిపాడు. దీంతో కవిత ఇంటికి సోదరుడు నాగరాజు వచ్చాడు. ఇంట్లో బెడ్‌రూం లోపల తాళం వేసి ఉండడంతో అతడు ఇరుగుపొరుగు వారిని తీసుకొచ్చాడు. ఈలోపు పుల్లారావు కూడా వచ్చాడు. అనంతరం గడ్డపారతో తలుపు పగులగొట్టి చూడగా కవిత చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉంది. కొన ఊపిరితో ఉన్న ఆమెను వారు వైద్యశాలకు తీసుకువెళ్లినప్పటికీ అప్పటికే మృతిచెందింది. తన సోదరి మరణానికి ఆమె భర్త పుల్లారావు, అతడి తల్లి భద్రమ్మ వేధింపులే కారణమని నాగరాజు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కవిత మృతదేహాన్ని ట్రైనీ ఐపీఎస్ మౌనిక పరిశీలించారు.

నీటితొట్టిలో పడి బాలుడి మృతి

వైరారూరల్, ఏప్రిల్ 15: మండలంలోని కేసీ సిరిపురం గ్రామానికి చెందిన కూరాకుల గోపి – భవానీ దంపతులకు కుమారుడు యశ్వంత్ (16 నెలలు) సోమవారం ఇంటి వద్ద ఆడుకుంటూ సమీపంలో ఉన్న నీటితొట్టిలో పడి మృతిచెందాడు. గోపికి ఉన్న ఇద్దరు కుమారుల్లో చిన్న కుమారుడు మృతిచెందాడు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు: ఏసీ

సత్తుపల్లి, ఏప్రిల్ 15: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. సత్తుపల్లి మండలంలోని గణేశ్‌పాడు, కల్లూరు మండలం చౌడవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించి కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేశారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాల మేరకు ధాన్యం కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయన కల్లూరు మండలంలోని పేరువంచ వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పౌరసరఫరా అధికారి చందన్‌కుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తగ్గుతున్న 'మార్కెట్' విస్తీర్ణం

- ఖమ్మం హోల్‌సేల్ మార్కెట్లో పోటాపోటీగా ఆక్రమణలు
- ముందు భాగాన షాపులు.. వెనుక భాగాన గోదాములు..
- ఇష్టారీతిన లారీలు.. వినియోగదారులకు ఇబ్బందులు..

హోల్‌సేల్ మార్కెట్లో వ్యాపారులు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న గోదాములు

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 15: ఖమ్మం హోల్‌సేల్ మార్కెట్లో నిబంధనల జాడ మచ్చుకైనా కన్పించకుండా పోతోంది. దీంతో కమీషన్ వ్యాపారులు పోటాపోటీగా ఆక్రమణలకు దిగారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు పూర్తిగా తిలోదకాలిచ్చి ముందు భాగాన దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దాని వెనుక భాగాన ఏకంగా గోదాములే నిర్మించుకున్నారు. పైగా ఖరీదుదారుల అవతారం ఎత్తి ఇతర ప్రాంతాల నుంచి ఏకంగా లారీల్లోనే సరుకు దిగుమతి చేసుకుంటున్నారు. సువిశాలమైన మార్కెట్లో దుకాణాలు, గోదాములకు పోగా మిగిలిన స్థలంలో ఆ లారీలనే ఉంచుతున్నారు. దీంతో కూరగాయల కోసం అక్కడికి వచ్చే రిటైల్ వ్యాపారులు, ఇతర వినియోగదారులను అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు అనుబంధంగా ఖమ్మం బైపాస్ రోడ్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లో కొందరు వ్యాపారులు ఆక్రమణలు పెంచారు. రైతుల సరుకుతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు, టమాటాలు సహా ఇతర కూరగాయలను లారీల్లో బల్క్‌గా తెప్పిస్తున్నారు. దీంతో షాపుల స్థలాలు సరిపోక వాటి ఎదుటనే డంప్ చేస్తున్నారు. అవి సరిపోక కొందరు వ్యాపారులు తమ దుకాణాల మార్కెట్ స్థలాన్ని ఆక్రమించి గోదాములు నిర్మించుకున్నారు. అధికారులెవరైనా గమనించి ప్రశ్నిస్తే.. ప్రజాప్రతినిధుల ద్వారా వారిపై ఒత్తిడిని తేవడం ప్రారంభించారు. అయితే, రోజూ తెల్లవారుజామున మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసే రిటైల్ వ్యాపారులు, ఇతర వినియోగదారులు ట్రాఫిక్ ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం..

హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లో కొంతమంది వ్యాపారులు ప్రభుత్వ అనుమతి లేకుండా షెడ్లు నిర్మించుకున్నట్లు మా దృష్టికి వచ్చింది. వాటిని వెంటనే తొలగించాలంటూ సదరు వ్యాపారులకు ఇప్పటికే మౌఖిక ఆదేశాలు ఇచ్చాం. అయినా స్పందించకపోతే మరోసారి లిఖితపూర్వకంగా నోటీసులు జారీ చేస్తాం. వినియోగదారులకు, రిటైల్ వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

–ప్రవీణ్‌కుమార్, ఖమ్మం ఏఎంసీ సెక్రటరీ

'ముత్తారం' కల్యాణానికి నారికేళ కళాకృతులు

సీతారాముల కల్యాణానికి రాధారాణి చేసిన కళాకృతులు

ముదిగొండ, ఏప్రిల్ 15 : మండల పరిధిలోని ముత్తారం శ్రీ సీతారాముల కల్యాణం కోసం హైదరాబాద్‌కు చెందిన వి.రాధారాణి అనే భక్తురాలు ప్రత్యేక నారికేళ కళాకృతులను రూపొందించడం అందరినీ ఆకట్టుకుంది. వీటిని ఆలయ అర్చకుడు బొర్రా వాసుదేవాచార్యులకు సోమవారం ఆమె అందజేశారు. ఈ కళాకృతులను రూపొందించేందుకు నెలరోజుల నుంచి రాంత్రింబవళ్లు శ్రమించినట్లు రాధారాణి తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పూసలు, ముత్యాలు సేకరించి వీటిని రూపొందించారు. కేరళ ప్రాంతానికి చెందిన కొబ్బరిబొండాలను నిల్వ ఉండే వాటిని తీసుకువచ్చినట్లు తెలిపారు. స్వామివారి పాదసేవలో భాగంగానే వీటిని తయారుచేసినట్లు చెప్పారు. కళాకృతులను చూసేందుకు ముదిగొండ ప్రజలు పెద్దఎత్తున ఆలయానికి వచ్చారు. రాధారాణి భక్తిని దేవాలయ కమిటీకి చెందిన తుళ్లూరు జీవన్, కాకి వీరభద్రం, వి వెంకటేశ్వరరావు, దేవాలయ శాశ్వత ధర్మకర్త వి వెకంట నాగేశ్వరరావు, కొనియాడారు.

వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోళ్లు షురూ..

ఖమ్మం యార్డుకు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 15 : నాలుగు రోజుల వరుస సెలవుల అనంతరం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి రైతులు 30 వేలకుపైగా మిర్చి బస్తాలు తీసుకురావడంతో మార్కెట్ ఉదయం జెండా పాట పెట్టారు. మిర్చి క్వింటా ధర రూ.19,500, మధ్య ధర రూ.16 వేలు కాగా.. కనిష్ట ధర రూ.9,500లకు పడిపోయింది. తాలు రకం క్వింటా రూ.9వేల గరిష్ఠ ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు. పత్తి యార్డుకు 4 వేల బస్తాలను తీసుకురాగా.. అనంతరం జరిగిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో క్వింటా గరిష్ఠ ధర రూ.7,275 పలికింది. అలాగే పెసలు క్వింటా గరిష్ఠ ధర రూ.8,100 కాగా, కంది గరిష్ఠ ధర క్వింటా రూ.10,600 పలికింది. పంట విక్రయానికి ఎక్కువగా వచ్చినా.. ఆశించిన ధర రాకపోవడంతో మిర్చి రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. క్రయవిక్రయాలు సజావుగా జరిగే విధంగా మార్కెట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, గ్రేడ్–టూ అధికారి బజార్, అసిస్టెంట్ సెక్రటరీ అంజనేయులుతో కలిసి పర్యవేక్షించారు.

స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్న విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15: ఖమ్మంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే పట్టాలు అందజేశారు. అనంతరం ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య పాల్గొన్నారు.

విద్యార్థినికి కలెక్టర్ అభినందన

విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 15: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు నిర్వహించిన వ్యాసరచన, పోస్టర్ తయారీ, స్లోగన్ రైటింగ్ తదితర పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని కలెక్టర్ వీపీ గౌతమ్ సోమవారం తన చాంబర్‌లో అభినందించి బహుమతి ప్రదానం చేశారు. మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్ సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థిని సపూర పోస్టర్ తయారీ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. దీంతో ఆ విద్యార్థినిని కలెక్టర్ ప్రశంసించారు. ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, డీఈవో సోమశేఖరశర్మ, ఆర్ఎంవో రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 15: మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో వివిధ కోర్సుల శిక్షణ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి కే రాంగోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్, కమ్యునికేషన్, డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల19లోపు పూర్తి చేసిన దరఖాస్తులను కలెక్టరేట్‌లోని కార్యాలయంలో అందజేయాలన్నారు.

పోలీస్ కమిషనర్‌కు సన్మానం

మామిళ్లగూడెం, ఏప్రిల్ 15 : రంజాన్ సందర్భంగా జిల్లాలో పకడ్బందీ చర్యలు చేపట్టిన ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ని సోమవారం మస్జీద్ కమిటీ పెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రషీద్, అలీఖాన్, అఫ్సర్, అజీజ్, అబ్దుల్ రెహ్మాన్, అష్జల్, మన్నాన్, మహబూబ్, షరీఫ్, హకీమ్ పాల్గొన్నారు.

అబాకస్‌లో 'న్యూ టైనిటాట్స్'కు గోల్డ్ మెడల్స్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15: నగరంలోని న్యూ టైనిటాట్స్ పాఠశాల విద్యార్థులు అబాకస్ వేదిక్ మ్యాథ్స్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్స్, బ్రాంజ్ మెడల్స్ సాధించారని పాఠశాల కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ తెలిపారు. విశ్వం ఎడ్యుటెక్ సంస్థ నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన సహాస్ర, సాత్విక్, సాయిప్రకాశ్, ఉదయ్, సాయిరాం, రుషికలను సోమవారం వారు అభినందించారు.

మార్వాడి వర్సిటీ అడ్మిన్ ఆఫీస్ ప్రారంభం

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15: గుజరాత్‌కు చెందిన మార్వాడి యూనివర్సిటీకి సంబంధించిన అడ్మిన్ ఆఫీస్‌ను ఖమ్మంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేశ్ కుమార్ పటేల్ మాట్లాడుతూ.. దేశంలోనే మార్వాడి యూనివర్సిటీ 23వ స్థానంలో ఉందని, న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు ఉందని అన్నారు. టెన్త్, ఇంటర్ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు అడ్మిష